
# 5 భోజరాజు



**నేపథ్యం:**
- బాబా ఆమ్టే సేవలను గురించి అంతర్జాలంలో చదివి తరగతిలో చర్చించండి.
- మీరు మీ కుటుంబంలోని వారు ఎప్పుడైనా సహాయ పడ్డారా? దానిని గురించి రాయండి.
- **'మానవసేవే మాధవసేవ'** అనే విషయాన్ని ఈ పాఠం ద్వారా తెలుసుకోండి.

ఒక రోజు భోజరాజు నిద్రలో హఠాత్తుగా మేల్కొన్నాడు. కిటికీలో నుండి ఒక బ్రహ్మాండమైన వెలుగు క్రిందకి దిగి నడుస్తున్నట్లుగా కన్పించింది. ఆ వెలుగులో ఒక దేవదూత కన్పించాడు. ఆ దేవదూత చేతిలో ఒక పుస్తకం బంగారు పూతతో మెరుస్తున్నది. మరో చేతిలో వజ్రాలు పొదిగిన కలం ఉన్నది. ఆ దేవదూత ఏదో రాస్తున్నాడు.



'ఓ దేవదూతా ! బంగారు పుస్తకంలో ఏమి రాస్తున్నావు ?' అని అడిగాడు భోజరాజు.

'ప్రజాసేవ చేస్తున్న వారి పేర్లను రాస్తున్నాను' అందరికన్నా ముందు నీపేరే రాశానని సమాధానం చెప్పాడు.

భోజరాజుకు చాలా ఆనందం కలిగింది.

మర్నాడు మళ్ళీ ఆ దేవదూత భోజరాజుకి కన్పించాడు. ఈసారి కూడా అదే పుస్తకంలో, ఆ కలంతోనే మళ్ళీ ఏదో రాస్తున్నాడు.

'ఈరోజు మళ్ళీ ఏమి రాస్తున్నారు ?' అని వినయంగా అడిగాడు భోజరాజు.

'దేశంలో ఉన్న భగవద్భక్తి కలిగిన వారి పేర్లు రాస్తున్నాను అన్నాడు దేవదూత.

రాజుగారికి నిరాశ కల్గింది. అందులో తన పేరు ఉండదు. ప్రజాసేవ తప్ప భగవంతుని అంతగా పూజించలేదు తను. కనీసం ప్రతిరోజు ప్రార్థన చేయటానికి, పూజించటానికి తనకి తీరిక లేదు అని తన మనస్సులో అనుకున్నాడు భోజరాజు.

భోజరాజు మనస్సులోని మాటలను గ్రహించిన దేవదూత ముందుగా, అందరికంటే పైన మీ పేరు రాస్తున్నాను' అన్నాడు.

భోజరాజు ఆశ్చర్యపోతూ, 'మరి నేనెప్పుడూ భగవంతుని గురించి అంతగా ప్రార్థించడంగాని, పూజించడంగాని చెయ్యలేదే?' అన్నాడు.

'మానవసేవయే మాధవసేవ'... మీరు చేస్తున్న ప్రజాసేవకు భగవంతుడు సంతుష్టి చెందాడు. మీరు భగవంతుని సేవకులైనారు' అని వివరించాడు దేవదూత.

## మానవసేవే మాధవసేవ

ఉ.సూ : కథలు, కవితలు, వైజ్ఞానిక, సాహస కథలు మొదలగు పఠనసాహిత్యాన్ని విద్యార్థులకు అందుబాటులో ఉండేటట్లు చేసి వారిలో పఠనాసక్తిని పెంపొందింప చేయండి.

### I. వినండి-సంభాషించండి.

1. 'మానవసేవ' అంటే ఏమిటి ? మానవసేవ చేసిన కొందరి గురించి చర్చించండి.
2. నీకు వచ్చిన కలను గురించి మిత్రునకు తెలియజేయి.

### II. కొత్త పదాలు నేర్చుకుందాం.

హఠాత్తుగా = ఒక్కసారిగా

బ్రహ్మాండమైన = గొప్పదైన

వజ్రాలుపొదిగిన = వజ్రాలు పెట్టబడిన

భగవద్భక్తి = దేవునిపై భక్తి

సంతుష్టి = తృప్తి

### III. చదవండి-చెప్పండి-రాయండి.

#### అ. సరియైన సమాధానం గుర్తించి రాయండి.

1. భోజరాజుకు వెలుగులో కనిపించినది

(అ) పుస్తకం (ఆ) కలం

(ఇ) దేవదూత (ఈ) బంగారం

2. మానవసేవయే ________

(అ) దేశసేవ (ఆ) మాధవసేవ

(ఇ) మాతృసేవ (ఈ) పితృసేవ

#### ఆ. ఒక్క వాక్యంలో జవాబులు రాయండి.

1. దేవదూత ఏం చేస్తున్నాడు ?
2. భోజరాజు దేవదూతని ఏమని ప్రశ్నించాడు?
3. భోజరాజు మనసులోని మాటలను గ్రహించిన దేవదూత ఏమన్నాడు ?

#### ఇ. మూడు, నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. హఠాత్తుగా మేల్కొన్న భోజరాజు ఏం చూశాడు ?
2. రెండవ రోజు భోజరాజుకు దేవదూతకు మధ్య జరిగిన సంభాషణ ఏమిటి ?
3. దేవదూత భోజరాజుకి ఏమని వివరించాడు?

### ఈ. ఖాళీలను పూరించండి.

1. భోజరాజు నిద్రలో ———— మేల్కొన్నాడు.
2. మీరు చేస్తున్న ————కు భగవంతుడు సంతుష్టి చెందాడు.

## IV. భాషావగాహన :

### అ. సొంత వాక్యాల్లో ఉపయోగించండి.

1. హఠాత్తుగా 2. హాయిగా 3. సంతుష్టిచెందు

### ఆ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి.

1. ఒక పుస్తకం బంగారు పూతతో మెరుస్తున్నది.
2. దేవదూత భోజరాజుకు కన్పించాడు.
3. అందరికంటే పైన మీ పేరు రాస్తున్నాను.
4. అందులో తన పేరు ఉండదు.

### ఇ. కాలాలను గుర్తించండి.

1. దేవదూత రాయబోవుచున్నాడు.
2. ఈరోజు మళ్ళీ ఏమి రాస్తున్నారు ?

### ఈ. వాక్యాంగములను గుర్తించండి.

1. దేవదూత పుస్తకంలో రాస్తున్నాడు.
2. భోజరాజు దేవదూతను ప్రశ్నించాడు.
3. రాజుగారికి నిరాశ కలిగింది.

### ఉ. వాచకాలు రాయండి.

1. భోజరాజు 2. పుస్తకం
3. భగవంతుడు 4. కలం

## V. గ్రంథాలయ సమయం :

1. మదర్ థెరీసా, శిబి చక్రవర్తి, రంతిదేవుడు వంటి మహనీయుల గురించి గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి, సొంత వాక్యాల్లో రాద్దాం.

2. తుఫాను, భూకంపం వచ్చిన సందర్భాలలో వార్తాపత్రికలలో వచ్చిన చిత్రములను సేకరించి ఆల్బమ్ తయారు చేద్దాం, ఆయా సందర్భాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

### వాక్యాంగాలు :

కింది వాక్యాలు చదవండి.

| ఆమె పూలను కోయుచున్నది. | వారు పాటను పాడుచున్నారు. | దేవదూత పేర్లను రాస్తున్నాడు. |
|---|---|---|

పై వాక్యాలలో 'కోయుచున్నది', 'పాడుచున్నారు', 'రాస్తున్నాడు'– ఈ పదాలు దేనిని తెలియజేయుచున్నవి? పనిని తెలియచేయుచున్నవి. ఇట్టి పనిని తెలియచేయు పదాలను క్రియలు అంటారు. క్రియా పదమును ఎవరు ? అని ప్రశ్నించినచో వచ్చు సమాధానమే 'కర్త', ఎవరు కోయుచున్నారు అని ప్రశ్నించినచో 'ఆమె' అని సమాధానము వచ్చును. కావున 'ఆమె' అనునది **'కర్త'.**

అదే విధంగా క్రియా పదాన్ని 'ఎవరిని, దేనిని' అని ప్రశ్నించినచో వచ్చు సమాధానమే **'కర్మ'.** దేనిని కోయుచున్నది? అని ప్రశ్నించినచో 'పూలను' అని సమాధానం వచ్చును. కావున 'పూలను' అను పదము 'కర్మ' యైనది. **ఈ కర్త, కర్మ, క్రియలనే వాక్యాంగములు అని అంటారు.**